క్లుప్తంగా

క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం ఎంఈఓ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. క్యాలెండర్లతోపాటు పాకెట్, స్టిక్కర్స్ క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీపతి, సునీల్, సీఆర్‌పీలు రెహమాన్, నర్మద పాల్గొన్నారు.

31న భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ



మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ రూరల్: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఈనెల 31వ తేదీ భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నామని, ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర సమర యోధుడు సర్దార్ భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువతకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు ఆ పార్టీ మండల కార్యదర్శి నారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సూర్యప్రతాప్, పట్టణ కార్యదర్శి మోటారాముడు, మనోజ్ ఉన్నారు.

శ్మశాన వాటికలో కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

కొలిమిగుండ్ల: పెట్నికోట శ్మశాన వాటికలో గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం కంపచెట్లను తొలగించే పనులు ప్రారంభించారు. దారంతా కంపచెట్లు పెరిగిపోయి నడిచేందుకు వీలు లేకుండా పోయింది. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించాలంటే ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రొక్లెయినర్ సాయంతో రహదారిలో పెరిగిన కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు. అలాగే వాగులో పెరిగిన చెట్లను తొలగించి మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక



మాట్లాడుతున్న జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న

డోన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సిడాప్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో అమరరాజా బ్యాటరీస్, సన్‌కిషాన్ అగ్రి, స్పందన, స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 32 మంది అభ్యర్థులు హాజరుకాగా 20 మంది ఎంపికైనట్లు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న తెలిపారు.

లూయిపాశ్చర్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న పశువైద్యశాఖ ఏడీ

డోన్: శాస్త్రవేత్తలను స్మరించుకోవడం మన కర్తవ్యమని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రముఖ జీవ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ జయంతిని పురస్కరించుకుని ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనేక అంటువ్యాధులకు కారణమయ్యే సూక్ష్మజీవులను కనుగొనడమే కాక అంటు రోగాల నివారణకు టీకాల ఆవిష్కరణలకు లూయి పాశ్చర్ ఆద్యుడయ్యారని కొనియాడారు. రేబిస్ టీకాను కనుగొన్నారని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త రఫీ పాల్గొన్నారు.

బాదుడు బ్రాండ్ అంబాసిడర్ బాబు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం
- బనగానపల్లెలో భారీ ర్యాలీ





బనగానపల్లె: విద్యుత్ చార్జీలపై నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: చంద్రబాబు అధికారంలో ఉంటే ప్రజలకు బాదుడు తప్పదని.. బాదుడుకు ఆయన బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక తగ్గించకపోగా ప్రజలపై రూ. 15 వేల కోట్ల భారాన్ని మోపారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరు బాట చేపట్టింది. బనగానపల్లె నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి వద్దకు భారీ ఎత్తున చేరుకున్నారు. అక్కడి నుంచి పెట్రోల్ బంకు కూడలి మీదుగా విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద ర్యాలీగా వెళ్లారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ఏడీఈ మద్దిలేటికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కరెంట్ చార్జీలు తగ్గిస్తామని నమ్మబలికిన చంద్రబాబు ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపగా మరో రూ. 9,400 కోట్ల భారాన్ని జనవరి నుంచి మోపేందుకు సిద్ధమవుతున్నట్లు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వగా, కూటమి ప్రభుత్వం వాటిని తొలగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలపై విద్యుత్ భారం మోపలేదన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బాదుడు మొదలు పెట్టిందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

సంపద సృష్టి అంటే ప్రజలపై భారం మోపడమేనా?

తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టించి హామీలను నేరవేరుస్తామని చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని.. ఇప్పుడేమే హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వ నిర్వాకమంటూ నిందలు వేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి హామీనీ అమలు చేశామని.. ఇవ్వని వాటిని కూడా చేసి చూపించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ అంటూ అధిక ధరలకు విక్రయిస్తూ ఆ పార్టీ నాయకులు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. ఆరు నెలల పాలనలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు కాలేదన్నారు. రాష్ట్రంలో 3.50 లక్షల పింఛన్లను తొలగించేందుకు సిద్ధమవుతోందన్నారు. నిత్యవసర సరకుల ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. నాపరాతి గనుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. యజమానులు ఆందోళనలో ఉండగా కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోలీసులు, అధికారుల సహకారంతో కూటమికి చెందిన వారే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. వారి దౌర్జన్యాలకు వడ్డీతో సహా చెల్లిస్తామని తెలిపారు.



ఏడీఈ మద్దిలేటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సామాన్యులపై భారం

సామాన్యులపై భారం మోపడమే చంద్రబాబునాయుడు పనిగా పెట్టుకున్నారని.. విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపే ఇందుకు నిదర్శనమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. రాష్ట్ర సంపంద మొత్తం ఒక్క అమరావతిలోనే పెడుతూ ఇతర ప్రాంతాలకు చంద్రబాబునాయుడు ద్రోహం చేస్తున్నారన్నారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సహాయక చర్యల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో బనగానపల్లె ఎంపీపీ మానసవీణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అత్తార్‌జాహెద్ హుస్సేన్, అబ్దుల్‌ఖైర్, అబ్దుల్‌ఫైజ్, ఈశ్వర్‌నాయక్, గుండం శేషిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, అంబటి గురవిరెడ్డి, జింకల వెంకటసుబ్బారెడ్డి, బయమ్మగారి రామసుబ్బారెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తాహీర్, సజ్జాద్, ముక్కమళ్ల పుల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ బాబు, నాగిరెడ్డి హరినాథ్‌రెడ్డి, బీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం వెంకటేశ్వరరెడ్డి, పార్థసారథిరెడ్డి, పెద్దమునిరెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి, దిల్క్ బాషా, మహేశ్వరరెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమ్మితే నట్టేట ముంచడం బాబు నైజం

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం
- డోన్‌లో భారీ నిరసన ర్యాలీ
- ఏడీఈకి వినతిపత్రం అందజేత

డోన్: ఎన్నికల సమయంలో నమ్మి ఓట్లు వేసిన ప్రజలను చంద్రబాబునాయుడు నట్టేట ముంచారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నినదించింది. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం నుంచి కోర్టు, పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్‌ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, నమ్మితే నట్టేట ముంచారని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ సబ్‌డివిజనల్ ఇంజినీరింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ నాగేంద్రయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



డోన్‌లో బైక్ ర్యాలీ

ఆరునెలలకే బాదుడు మొదలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే సామాన్యులపై చార్జీల భారం మోపుతోందని డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. యూజర్ చార్జీలు, కరెంట్ చార్జీలు, ఆస్తి పన్నులు విపరీతంగా పెంచి ప్రజలను ఆర్థికంగా కుంగదీసిందన్నారు. సంపద సృష్టిస్తామని నమ్మబలికి సామాన్య ప్రజలపై మోయలేని భారం మెపిందని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసి ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తొలి ఏడాదిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక నాలుగేళ్లలో సామన్యులు, మధ్య తరగతి ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో తలచుకుంటేనే భయం వేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ మండల అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, నాయకులు పెద్దపూజెర్ల భాస్కర్‌రెడ్డి, మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, మునీశ్వరరెడ్డి, మల్యాల భాస్కర్‌రెడ్డి, యాపదిన్నె నరసింహారెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, ఎద్దుపెంట జయచంద్ర, ఓబులాపురం సుధాకర్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ ఏడీ, ఏఈలు

బేతంచెర్ల: ప్రధానమంత్రి సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత పోస్టాఫీస్ లైన్‌లో సింగసాని కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ రాయితీతో 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ ఏడీ, ఏఈలు పుల్లయ్య, శ్రీనివాసులు పరిశీలించారు. పట్టణంలో మొదటిసారిగా సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న కిరణ్‌ను అభినందించారు. 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాడానికి సుమారు రూ. 2 లక్షలు ఖర్చు వస్తుందని ఇందులో రూ.78 రాయితీ ఉంటుందని ఏడీ తెలిపారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం పొందవచ్చన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

డోన్ టౌన్: డోన్ సబ్ జైలులో ఉన్న బనగానపల్లె మండలం యాగంటిపల్లె గ్రామానికి చెందిన బండి బ్రహ్మానందరెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. అధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి బ్రహ్మానందరెడ్డిని బాధ్యున్ని చేసి అక్రమ కేసులతో వేధించడం తగదన్నారు. అక్రమ కేసులపై న్యాయపరంగా ముందుకెళతామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కాటసా ని తిరుమల్‌రెడ్డి, సిద్ధరామ్‌రెడ్డి, అంబటి రవి, పార్థసారథిరెడ్డి, జిల్లెల శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ల జారీ ప్రైవేట్‌కు అప్పగించడం సరికాదు

డోన్ టౌన్: డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆర్టీఓ కార్యాలయాల నుంచే జారీ చేయాలని డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంవీఐ క్రాంతి కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మద్దిలేటి, రాజు, సుబ్బరాయుడు, హుస్సేన్ పాల్గొన్నారు.



ఎంవీఐకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

బేతంచెర్లలో డ్రైవర్ల ధర్నా

బేతంచెర్ల: డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రభుత్వమే చేసేలా చూడాలని.. ప్రైవేటు పరం చేయవద్దని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, లారీ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ మారుతికి వినతి పత్రం అందజేశారు.

కృష్ణాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: ఆధ్యాత్మిక నిలయాలుగా ఆలయాలు విరాజిల్లుతున్నాయని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్ తిమ్మయ్య, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాగరాజు, పద్మనాభం, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జడ్జి

డోన్ టౌన్: ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శుక్రవారం వినియోగదారుల రక్షణ హక్కులపై పౌరశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన మేలుకోలుపు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కుమారి, మద్దయ్య, వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏతఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కబడ్డీ పోటీలు

అవుకు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని శింగనపల్లె గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పులి సత్యం, దేవ, దేవన్న, ముని, ఇమ్మానియేల్, భాస్కర్ తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఈనెల 29వ తేదీ సాయంత్రం 6గంటల్లోపు ఎంట్రీ ఫీజు చెల్లించి టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. 30, 31వ తేదీల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, నాల్గో బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

పుకార్లు నమ్మొద్దు

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో పుకార్లు, అపోహాలు నమ్మొద్దని ఎస్ఐ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం నందివర్గంలో ఆయన పర్యటించారు. క్షుద్ర పూజలు, గుప్త నిధులపై జరుగుతున్న పుకార్లపై గ్రామ సభ ఏర్పాటు చేశారు. గ్రామంలో మూఢ నమ్మకాలపై వస్తున్న ప్రచారం నమ్మరాదని సూచించారు. వదంతులను నమ్మి అమాయకులపై దాడి చేయడం మంచిది కాదన్నారు. గ్రామంలో పోలీసుల పహారా ఏర్పాటు చేశామని.. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఆకతాయిలను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఐ

ఉద్యోగులకు సమయపాలన ముఖ్యం

కొలిమిగుండ్ల: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల డివిజనల్ అభివృద్ధి అధికారి శివారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి నందిపాడు, కనకాద్రిపల్లె గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఎంఎస్ఎంఈ, ఎస్సీ కాస్ట్ సర్వే లిస్ట్ పబ్లికేషన్, ఈ-సర్వీసెస్ పెండింగ్ చలానాలు, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను పాటించాలని చెప్పారు. సరైన కారణాలు లేకుండా ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదన్నారు.



నందిపాడులో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ

పారిశ్రామికవేత్త హసన్‌ఖాన్ మృతి



డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లోడి హసన్‌ఖాన్ (92) శుక్రవారం మృతి చెందారు. ఈయన సున్నం, డోలమైట్ పౌడర్‌తో పాటు పలు రకాల ఖనిజాల వ్యాపారం చేశారు. వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

డోన్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి డోన్ వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, మండల అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి, నాయకులు భాస్కర్ రెడ్డి, ఎద్దుపెంట క్రిష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కటిక వేణు, రైల్వే నాగేంద్ర, బోయ కళావతి, శివలక్ష్మి కుళ్లాయి, మిట్టా రవికుమార్, పాలుట్ల రఘురాం, ఎంపీటీసీ సభ్యులు ఓబులేసు, సుధాకర్, గౌస్, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, రఫి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్ టౌన్: ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని పాతపేట జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పాఠశాలలో శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: అత్యవసర సమయాల్లో రక్తం అందించి బాధితులను ఆదుకునే వారే ప్రాణదాతలని సీఐ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం కనకాద్రిపల్లె అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో మండల రెడ్‌క్రాస్, ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. కర్నూలుకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లెకు చెందిన యువకులు, అయ్యప్పస్వాముల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, గ్రామపెద్దలు వీఆర్ లక్ష్మిరెడ్డి, వెంకటమల్లారెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు గౌడ్, వలి, సుబ్బరాయుడు, మోహన్, దస్తగిరి, నాగరాజు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయండి



ప్రచార ర్యాలీలో యూటీఎఫ్ నాయకులు

డోన్ టౌన్/బనగానపల్లె రూరల్: కాకినాడలో జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం డోన్, బనగానపల్లెలో ప్రచార ర్యాలీ నిర్వహించి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.